సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
సోమవారం ၊ 5 ၊ జూన్ ၊ 2023



హైవేపై హాయిగా ప్రయాణం

2015లో భారీవర్షాల కారణంగా మనుబోలు - గూడూరు మధ్య హైవేపై కొట్టుకుపోయిన వంతెనల స్థానంలో ఇటీవల కొత్తవి నిర్మించడంతో ప్రయాణం సులభతరమైంది. 8లో



బంగారం ధరలు

24 క్యారెట్లు(10 గ్రాములు) -	రూ.61.520
22 క్యారెట్లు ఆర్నమెంటు(గ్రా) -	రూ.5,525
3 శాతం జీఎస్టీతో.. -	రూ.5,691
నవర(8 గ్రా) -	రూ.45,528

వాతావరణం

గరిష్టం/కనిష్టం 39.9 /33.7

ఆదివారం గాలిలో తేమ 43 శాతం ఉంది. సోమవారం అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉంది. వడగాడ్పులు, ఉక్కపోత ఉంటాయని అధికారులు తెలిపారు.

న్యూస్‌రీల్

97.56 శాతం పింఛన్ల అందజేత



నెల్లూరు ఆస్పత్రిలో చికిత్సపొందుతున్న చీకవోలుకు చెందిన రమణరాజుకు పింఛన్ నగదు అందజేస్తున్న వెల్ఫేర్ అసిస్టెంట్ రసూల్

నెల్లూరు(పొగతోట): వైఎస్సార్ పింఛన్ల పంపిణీ ప్రక్రియ కొనసాగుతోంది. నాలుగో రోజు ఆదివారానికి 97.56 శాతం మంది లబ్ధిదారులకు వలంటీర్లు పింఛన్ నగదు పంపిణీ చేశారు. మొత్తం 3,05,723 మంది లబ్ధిదారులకు పింఛన్ కానుక అందజేయాల్సిఉండగా 2,98,266 మందికి పంపిణీ చేశారు.


కామాక్షితాయి సేవలో కలెక్టర్, కమిషనర్



కలెక్టర్, కమిషనర్‌కు అమ్మవారి చిత్రపటాలను అందజేస్తున్న అర్చకులు

బుచ్చిరెడ్డిపాళెం: మండలంలోని జొన్నవాడలో వెలసిన శ్రీమల్లికార్జునస్వామి సమేత కామాక్షితాయి అమ్మవారిని కలెక్టర్ ఎం.హరినారాయణన్, నెల్లూరు కార్పొరేషన్ కమిషనర్ వికాస్‌మర్మత్ ఆదివారం దర్శించుకున్నారు. ఇద్దరు తొలిసారిగా ఆలయానికి రావడంతో ఆలయ మర్యాదలతో అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం గణపతిస్వామి, సుబ్రహ్మణ్య స్వామి, మల్లికార్జునస్వామి, కామాక్షితాయి అమ్మవార్ల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ చైర్మన్ పుట్టా సుబ్రహ్మణ్యంనాయుడు వారిని స్వామివారి శేషవస్త్రాలతో సత్కరించి అమ్మవారి చిత్రపటాలను, తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఈఓ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సోమశిలలో 39.425 టీఎంసీలు



చేజర్ల(సోమశిల): సోమశిల జలాశయంలో ఆదివారం సాయంత్రానికి 39.425 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పైతట్టు ప్రాంతాల నుంచి 156 క్యూసెక్కుల వంతున వరద ప్రవాహం వచ్చి చేరుతోంది. కాగా పెన్నార్ డెల్టాకు 3,700 క్యూసెక్కులు, ఉత్తర కాలువకు 230, దక్షిణ కాలువకు 200, కండలేరుకు 100 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నారు. జలాశయంలో 94.031 మీటర్ల నీటిమట్టం నమోదైంది.

ప్రశాంతంగా జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష

నెల్లూరు(టౌన్): ఐఐటీలో ప్రవేశం కోసం ఆదివారం నిర్వహించిన జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి 5.30 గంటల వరకు రెండు విడతల్లో ఆన్‌లైన్‌లో పరీక్షను నిర్వహించారు. ఈ పరీక్షకు 97 శాతం మందికి పైగా విద్యార్థులు హాజరైనట్లు నిర్వాహకులు తెలిపారు. పరీక్ష సమయానికి 2 గంటలకు ముందుగా విద్యార్థులను కేంద్రంలోకి అనుమతించారు. విద్యార్థుల వద్ద ఉన్న వాచ్‌లు, బెల్ట్‌లు, ఎలక్ట్రానిక్ వస్తువులు, బంగారు, వెండి ఆభరణాలను తీయించి కేంద్రంలోకి అనుమతించారు.

జిల్లాలో వ్యవసాయం, పాడిపరిశ్రమపై ఆధారపడి రైతులు జీవనం సాగిస్తున్నారు. వ్యవసాయానికి ప్రాధాన్యం ఇచ్చినట్లుగానే పాడిపరిశ్రమ అభివృద్ధికి కూడా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోంది. అందులో భాగంగా పాడిరైతుల ఇళ్ల వద్దే పశువులకు వైద్యం అందించేలా ప్రభుత్వం ఏర్పాటు చేసిన వైఎస్సార్ సంచార పశు ఆరోగ్యసేవ వాహనాలను పశుపోషకులు సద్వినియోగం చేసుకుంటున్నారు.



ఇంటి వద్దకే పశువైద్యం



- వైఎస్సార్ సంచార పశు ఆరోగ్యసేవ ద్వారా మూగజీవాలకు చికిత్స
- జిల్లాలో పశువైద్యసేవలు అందిస్తున్న 19 అంబులెన్సులు
- 1962 నంబర్‌కు కాల్ చేస్తే తక్షణ స్పందన
- 15 వేలకు పైగా పశువులకు చికిత్స
- పశుబీమాతో మరింత భరోసా

నెల్లూరు(సెంట్రల్): జిల్లాలో వ్యవసాయం తరువాత పాడి పరిశ్రమను కూడా నమ్ముకుని రైతులు జీవనం సాగిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ రంగానికి ప్రాధాన్యం ఇస్తూ అన్నదాతలకు అన్నివిధాలుగా సహాయ సహకారాలు అందిస్తున్నట్లుగానే పాడి రైతులకు అండగా నిలుస్తోంది. మూగజీవాలను నమ్ముకుని జీవనం సాగిస్తున్న ప్రతి పాడి రైతుకు ఎక్కడా నష్టం వాటిల్లకుండా ఉండేలా అన్నిరకాల చర్యలను తీసుకుంటోంది. మనుషులకు అనారోగ్యం చేస్తే వైద్యసేవలు అందించినట్లే పశువులకు కూడా వైద్యం అందించాలనే ఉద్దేశంతో 'డాక్టర్ వైఎస్సార్ సంచార పశుఆరోగ్య సేవ' పేరుతో ప్రత్యేక అంబులెన్స్‌లను ఏర్పాటు చేసింది. ఈ సేవలను పాడి రైతులు వినియోగించుకుంటున్నారు.

జిల్లాలో 19 అంబులెన్స్‌లు

'డాక్టర్ వైఎస్సార్ సంచార పశుఆరోగ్య సేవ' కోసం రాష్ట్ర ప్రభుత్వం 1962 కాల్‌సెంటర్‌ను కూడా ఏర్పాటు చేసింది. ప్రతి నియోజకవర్గానికి రెండు చొప్పున ఈ ప్రత్యేక అంబులెన్స్‌లను అందజేసింది. ఆత్మకూరు, కందుకూరు, ఉదయగిరి, కోవూరు, నెల్లూరు రూరల్, నెల్లూరు సిటీ, సర్వేపల్లి, కావలితో పాటు వెంకటగిరి నియోజకవర్గంలోని కలువాయి, సైదాపురం, రాపూరు మండలాలు నెల్లూరు జిల్లాలో ఉండడంతో వాటితో కలిపి మొత్తం 19 అంబులెన్స్‌లను ప్రభుత్వం ఏర్పాటు చేసింది.

పశు బీమా సౌకర్యం

రాష్ట్ర ప్రభుత్వం మూగజీవాలకు పశుబీమా సౌకర్యాన్ని కల్పించింది. ఒక కుటుంబానికి సంబంధించి 5 గేదెలు, 50 గొర్రెలు/ మేకలు ఉన్న వారికి ఈ బీమా వర్తించేలా చర్యలు తీసుకుంది. బీమాలో నమోదు చేసుకున్న పాడి రైతులకు అనుకోని నష్టం జరిగితే ఆవు/గేదెకు రూ.30 వేల వరకు పరిహారం అందుతుంది. గొర్రె/మేకకు రూ.6 వేల వరకు నష్ట పరిహారాన్ని ప్రభుత్వం అందిస్తుంది. స్థానిక రైతుభరోసా కేంద్రాల్లో ఈ బీమా కోసం నమోదు చేసుకునేలా పశుసంవర్ధకశాఖ ఏర్పాట్లు చేసింది.

1962 నంబరుకు కాల్ చేస్తే చాలు

జిల్లాలో ఏ మారుమూల ప్రాంతంలోనైనా మూగజీవాలకు ఎలాంటి ప్రమాదం జరిగినా, అనారోగ్య సమస్య వచ్చినా 1962 నంబరుకు కాల్ చేస్తే అంబులెన్స్ వెంటనే ఆ ప్రాంతానికి చేరుకుంటుంది. అయితే 8 నియోజకవర్గాల్లో ఇప్పటివరకు 15,380 మూగజీవాలకు చికిత్స చేసి వాటికి ప్రాణాలు పోశారు. రాష్ట్ర ప్రభుత్వం మూగజీవాల కోసం ఏర్పాటు చేసిన ఈ ప్రత్యేక అంబులెన్సుల్లో పశువైద్యుడితోపాటు ఇద్దరు సిబ్బంది, వైద్యానికి కావాల్సిన చికిత్స కిట్లు అందుబాటులో ఉంటాయి. పశువైద్య సిబ్బంది పాడి రైతుల వద్దకే వెళ్లి అంబులెన్సులోని పరికరాలను ఉపయోగించి మూగజీవాలకు వైద్యం అందిస్తారు. ఏదైనా ప్రమాదకరంగా ఉంటే అదే అంబులెన్స్‌లో స్థానికంగా ఉన్న పశువైద్యశాలకు తరలించి వైద్యం చేస్తారు.

జిల్లాలో..

నియోజకవర్గాలు - 8	ఆవులు, గేదెలు - 6.56 లక్షలు
పశువైద్యసేవలు అందిస్తున్న అంబులెన్స్‌లు - 19	గొర్రెలు, మేకలు - 14 లక్షలకు పైగా

పాడి రైతులకు ఎంతో మేలు



ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాడి రైతులకు అన్నివిధాలుగా అండగా ఉంటూ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక అంబులెన్స్‌ల ద్వారా మూగజీవాలకు చికిత్సలు అందిస్తున్నారు. అలాగే పశువులకు బీమా సౌకర్యం కల్పించడం సంతోషకరం.
– ఆర్.సుధమ్మ, డీసీ పల్లి

తక్షణమే స్పందించి చికిత్సలు



రాష్ట్ర ప్రభుత్వం మూగజీవాలకు సంబంధించి ప్రత్యేక అంబులెన్స్‌లతో పాటు బీమా సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకు వచ్చింది. ఈ సేవలను పాడి రైతులు బాగా వినియోగించుకుంటున్నారు. ఎక్కడి నుంచి కాల్ వచ్చినా తక్షణమే స్పందించి అంబులెన్స్‌లు ఆ ప్రాంతాలకు వెళ్లి చికిత్స అందిస్తున్నారు. అలాగే బీమా సౌకర్యం అందుబాటులో ఉంది. పాడి రైతులు ఈ బీమాను వినియోగించుకోవాలి.
– మహేశ్వరుడు, జేడీ, పశుసంవర్ధకశాఖ



కనులపండువగా చాముండేశ్వరీదేవి కల్యాణం



కల్యాణం అనంతరం విశేష అలంకరణలో స్వామి, అమ్మవారు

ఇందుకూరుపేట: వేదపండితుల మంత్రోచ్చారణలు.. భక్తుల జయజయ ధ్వానాలు.. మంగళ వాయిద్యాల నడుమ శ్రీచాముండేశ్వరీదేవి సమేత త్రిశూలేశ్వరస్వామి కల్యాణోత్సవం కనులపండువగా నిర్వహించారు. మండలంలోని గంగపట్నం శ్రీచాముండేశ్వరీదేవి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం వేకువజామున స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. దేవదేవరుల కల్యాణాన్ని వీక్షించేందుకు జిల్లా నలుమూలల నుంచి భక్తులు తరలివచ్చారు. అమ్మవారికి పూలంగిసేవ ఘనంగా జరిగింది. వసంతోత్సవం, త్రిశూలేశ్వరస్వామి ఉత్సవం, గంగోత్సవం వేడుకగా జరిగాయి. పూలంగిసేవకు పొట్టిపాళెనికి చెందిన సుధాకర్ జ్ఞాపకార్థం సతీమణి పద్మమ్మ, కుమారులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. అమ్మవారి భక్తుల ఆధ్వర్యంలో భారీ అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో కార్యనిర్వాహణాధికారి బండి శాంతయ్య, మాజీ చైర్మన్ కొండూరు కృష్ణారెడ్డి, నాయకుడు పంబాల జనార్దన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల్లో నేడు

బ్రహ్మోత్సవాల్లో అత్యంత ముఖ్యమైన రథోత్సవం(సిరిమాను) సోమవారం రాత్రి జరగనుంది. ఈ సందర్భంగా అగ్నిగుండం, ధ్వజావరోహణ కార్యక్రమాలను నిర్వహించనున్నారు.

ప్రేమ్‌సాగర్‌రెడ్డి సేవలు స్ఫూర్తిదాయకం

- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



మాట్లాడుతున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

వెంకటాచలం: మాతృభూమిపై ఉన్న మమకారంతో ఎన్‌ఆర్‌ఐ డాక్టర్ ననమాల ప్రేమ్‌సాగర్ రెడ్డి చేస్తున్న సేవా కార్యక్రమాలు స్ఫూర్తిదాయకమని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. వెంకటాచలం మండలం నిడిగుంటపాళెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం ప్రేమ్‌సాగర్‌రెడ్డి సహకారంతో శంకర నేత్రాలయ(చెన్నై) ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరాన్ని మంత్రి కాకాణి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నిడిగుంటపాళెంలో జన్మించిన ప్రేమ్‌సాగర్‌రెడ్డి అమెరికాలో స్థిరపడినా సొంత గ్రామానికి కోట్లాది రూపాయలు వెచ్చించి సీసీరోడ్లు, తాగునీటి పథకాలు, జెడ్పీ హైస్కూల్ భవనాలు, వసతిగృహ భవనం నిర్మించడం గొప్ప విషయమన్నారు. అంతేకాకుండా ఈ ప్రాంత ప్రజల కంటి సంబంధిత సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు వారం రోజులపాటు ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించడం అభినందనీయమని తెలిపారు. శంకర నేత్రాలయ వైద్య బృందం అత్యాధునిక వైద్య పరికరాలతో రోగులను పరీక్షించి ఉచితంగా కంటికి శస్త్రచికిత్సలు చేస్తున్నారని తెలిపారు. కంటి సమస్యలను ఏ ఒక్కరూ నిర్లక్ష్యం చేయవద్దని, ఈ శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రాష్ట్రంలో పేద ప్రజలకు అన్నిరకాల వైద్యసేవలు అందించిన ఘనత దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డికి మాత్రమే దక్కిందని గుర్తుచేశారు. ఆ తర్వాత ఆ స్థాయిలో పేద ప్రజలకు కార్పొరేట్ వైద్యసేవలు అందిస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనని స్పష్టం చేశారు. అన్ని ప్రభుత్వ ప్రాథమిక, సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో కంటి వైద్యపరీక్షలు చేసి వారం రోజుల్లో కంటి అద్దాలు అందజేస్తున్నట్లు తెలిపారు. 'వైఎస్సార్ కంటి వెలుగు' కార్యక్రమం ద్వారా విద్యార్థులకు కంటి వైద్యపరీక్షలు చేసి వారి సమస్యలను పరిష్కరించేలా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చర్యలు చేపట్టారని తెలిపారు. అనంతరం కంటి శస్త్రచికిత్సల కోసం ప్రత్యేకంగా తీసుకువచ్చిన రెండు మొబైల్ ఐ సర్జికల్ యూనిట్లను మంత్రి ప్రారంభించారు. కార్యక్రమంలో శంకర నేత్రాలయ అడ్మిన్ డాక్టర్ అరుణ్‌కుమార్, శ్రీహరిరెడ్డి, రవీంద్రరెడ్డి, వైస్ ఎంపీపీ కనుపూరు కోదండరామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మందల వెంకటశేషయ్య, నాయకులు కట్టంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, విజయకుమార్‌రెడ్డి, రోహిత్‌రెడ్డి, కొణిదెన మోహన్‌నాయుడు, విజయభాస్కర్‌నాయుడు, అడపాల ఏడుకొండలు, పైనం నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

గుప్త నిధుల తవ్వకాల ఘటనలోనే శ్రీను మృతి!

- ప్రదేశాన్ని పరిశీలించిన పోలీసులు
- పోలీసు అదుపులో ఇద్దరు కీలక వ్యక్తులు
- ముఠాలో మరికొందరిపై విచారణ



దుర్గంపై ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

ఉదయగిరి: ప్రకాశం జిల్లా పుల్లలచెరువు మండలం ముటుకుల గ్రామానికి చెందిన ఉప్పు శ్రీను(35) ఉదయగిరి దుర్గంపై గుప్తనిధుల కోసం జరిపిన తవ్వకాల్లో వాడిన పేలుడు పదార్థం వల్ల మృతిచెందినట్లు పోలీసులు నిర్ధారణకు వచ్చినట్లు తెలుస్తోంది. ఉదయగిరి దుర్గంపై చిన్న మసీదు సమీపంలో కోనేరు వద్ద జరిపిన గుప్త నిధుల తవ్వకాల ప్రదేశాన్ని ఆదివారం పుల్లలచెరువు, అర్ధవీడు ఎస్సైలు పులి రాజేష్, ఎం.శ్రీహరి తమ సిబ్బందితో కలిసి పరిశీలించారు. గత నెల 31వ తేదీన జరిపిన తవ్వకాల్లో వినియోగించిన పేలుడు పదార్థంతో మృతిచెందిన శ్రీనును తన సొంతూరులో ఈ నెల 1వ తేదీ రాత్రి ముఠా సభ్యులు మూటకట్టి పడేసి కొంత నగదు, ఓ లేఖ అందులో ఉంచిన విషయం తెలిసిందే. పోలీసుల దర్యాప్తు ఆధారంగా గుప్తనిధుల విషయం వెలుగులోకి వచ్చింది. దీంతో రెండ్రోజుల నుంచి ఉదయగిరి సీఐ గిరిబాబు సహకారంతో విచారణ చేపట్టారు. ఆదివారం తవ్వకాలు జరిపిన ప్రాంతానికి వెళ్లారు. అక్కడ ఉన్న సొరంగ మార్గం, పేలుడు జరిపిన ఆనవాళ్లను గుర్తించారు. సుమారు 15 అడుగుల మేర సొరంగం ఉన్నట్లు గుర్తించారు. అక్కడ ఉన్న గడ్డపార, టార్చిలైట్, తాళ్లు, మృతదేహాన్ని తరలించేందుకు వినియోగించిన కర్ర తదితర సామగ్రిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ తవ్వకాల్లో పాత్ర ఉన్న బుచ్చికి చెందిన ఓ పూజారిని, ఉదయగిరిలో జిరాక్స్ సెంటర్ నడుపుతున్న ఓ వ్యక్తితో పాటు మరికొంతమందిని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. ఈ వ్యవహారంలో నెల్లూరు, ప్రకాశం జిల్లాకు చెందిన 10 మందికి పైగా వ్యక్తుల పాత్ర ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. ఈ కేసుకు సంబంధించి పూర్తి వివరాలు సోమవారం ప్రకాశం జిల్లా పోలీసులు వెల్లడిస్తారని సమాచారం.

పసుపు రైతులకు తీపి కబురు

- నేడు ఉదయగిరిలో కొనుగోలు కేంద్రం ప్రారంభం
- ఆరంభమైన రైతుల రిజిస్ట్రేషన్లు

ఉదయగిరి: జిల్లాలో ఉదయగిరి, దుత్తలూరు, మర్రిపాడు, సీతారామపురం, అనంతసాగరం, వరికుంటపాడు మండలాల్లో మాత్రమే రైతులు పసుపు పంట సాగు చేస్తారు. జిల్లాలో దాదాపు 220 ఎకరాల్లో పసుపు సాగు చేశారు. ఉదయగిరి మండలం కొండకింద పల్లెలైన బిజ్జంపల్లి, కొత్తపల్లి, లింగంనేనిపల్లి, బండగానిపల్లి, కృష్ణారెడ్డిపల్లి తదితర గ్రామాల్లో ప్రతి ఏటా ఈ పంట సాగవుతుంది. గత టీడీపీ ప్రభుత్వంలో పసుపు రైతులు ఇబ్బందులు పడగా, ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం గిట్టుబాటు ధర పెంచడం, ఉదయగిరిలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయడంతో రైతులకు సానుకూలంగా ఉంది. మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి, మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి చొరవతో సోమవారం నుంచి పసుపు కొనుగోళ్లు ప్రారంభమవుతున్నాయి.

రైతులను ఆదుకునే దిశగా..

ఎకరాకు 40 నుంచి 50 క్వింటాళ్ల వరకు పసుపు దిగుబడి వస్తోందని రైతులు చెబుతున్నారు. ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో క్వింటా ధర నాణ్యతను బట్టి రూ.4,500 నుంచి రూ.5 వేల వరకు వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. అయితే ప్రభుత్వం పసుపు సాగు రైతుల ప్రయోజనార్థం రూ.6,850 గిట్టుబాటు ధర ప్రకటించింది. ఈ ధరకు కొనుగోలు చేసేందుకు ఉదయగిరిలో సోమవారం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేస్తున్నట్లు మార్క్‌ఫెడ్ అధికారులు తెలిపారు. ఈ ఏడాది 160 మంది రైతులు పసుపు సాగు చేయగా ఇప్పటి వరకు సుమారు 110 మంది రైతులు రైతుభరోసా కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకున్నారు. మిగిలిన వారు కూడా త్వరలో పేర్లు నమోదు చేసుకోవాలని మార్క్‌ఫెడ్ అధికారులు చెబుతున్నారు.

కొనుగోలు కేంద్రం ఏర్పాటు

ఉదయగిరి ఏఎంసీ ఆవరణలో సోమవారం పసుపు కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేస్తున్నాం. ఇప్పటికే రైతులు ఆర్బీకేల్లో తమ పేర్లను నమోదు చేసుకున్నారు. ఈ నెల 12వ తేదీ లోపు పూర్తిస్థాయిలో కొనుగోలు చేస్తాం. రైతులు వెంటనే తమ పేర్లు నమోదు చేసుకోవాలి. ప్రభుత్వం పసుపు పంటను మద్దతు ధరకు కొనుగోలు చేస్తోంది. – పవన్‌కుమార్, జిల్లా మార్క్‌ఫెడ్ డీఎం

జిల్లాలో ఉపాధ్యాయుల ఖాళీలపై స్పష్టత

నెల్లూరు(టౌన్): జిల్లాలో ఉపాధ్యాయుల ఖాళీలపై ఓ స్పష్టత వచ్చింది. గత కొన్ని రోజులుగా ఉపాధ్యాయ ఖాళీలపై లెక్కలు తేల్చే పనిలో జిల్లా విద్యాశాఖాధికారులు ఉన్నారు. ఉపాధ్యాయులు తెలిపిన పలు అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకొని తుది జాబితాను విద్యాశాఖ వెబ్‌సైట్‌లో ఉంచారు. ఈ నేపథ్యంలో ఐదేళ్ల సర్వీస్ పూర్తి చేసుకున్న హెడ్ మాస్టర్లు, 8 ఏళ్లు పూర్తి చేసుకున్న ఉపాధ్యాయులు ఖాళీలకు ఆప్షన్ ఇచ్చుకోవాల్సి ఉంది. జిల్లాలో 3,269 ఖాళీలు ఉన్నట్లు లెక్క తేల్చారు. హెచ్‌ఎంలు 118, సెకండరీ గ్రేడ్ టీచర్లు 1,540, ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎంలు 150, బయాలజీ 148, ఇంగ్లిష్ 347, హిందీ 135, గణితం 237, ఫిజికల్ ఎడ్యుకేషన్ 57, సోషల్ 170, తెలుగు 208, ఉర్దూ 27 పోస్టులు ఉన్నాయి.

హైవేపై హాయిగా ప్రయాణం

వరదల కారణంగా జాతీయ రహదారిపై వంతెనలు కొట్టుకుపోయాయి. రోడ్డుకు గండ్లు పడ్డాయి. పనుల విషయంలో తీవ్ర జాప్యం జరిగింది. సకాలంలో పూర్తికాక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వైఎస్సార్‌సీపీ చొరవ తీసుకోవడంతో నిరీక్షణకు తెర పడింది. పనులు వేగంగా జరిగి ప్రస్తుతం జాతీయ రహదారిపై రాకపోకలు హాయిగా సాగుతున్నాయి.

- 2015లో వరదలు
- మనుబోలు – గూడూరు మధ్య దెబ్బతిన్న జాతీయ రహదారి
- పనుల విషయంలో చొరవ తీసుకోని టీడీపీ
- కేంద్రం దృష్టికి సమస్యను తీసుకెళ్లిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం
- విస్తరణ, వంతెనల నిర్మాణం



ఆదిశంకర కళాశాల వద్ద పూర్తయిన ఫ్లై ఓవర్

మనుబోలు: అది 2015 సంవత్సరం.. నవంబర్, డిసెంబర్ నెలల్లో కురిసిన భారీ వర్షాలకు వరద పోటెత్తింది. దీంతో మనుబోలు – గూడూరు మధ్య హైవేపై పలుచోట్ల భారీ గండ్లు పడి మూడు వంతెనలు కొట్టుకుపోయాయి. గత 50 సంవత్సరాల్లో ఎన్నడూ లేనివిధంగా వరద పోటెత్తినట్లు చెబుతుంటారు. అప్పట్లో రాకపోకలను పునరుద్ధరించేందుకే వారంరోజుల సమయం పట్టిందంటే వరద ఏ స్థాయిలో ఉందో తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. తర్వాత కొద్దినెలలకు గండ్లు పడిన చోట తాత్కాలికంగా డైవర్షన్ రోడ్లు ఏర్పాటు చేశారు.

సీఎం వైఎస్ జగన్ చొరవతో..

2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, స్థానిక నాయకులు హైవే సమస్యను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. సీఎం కేంద్రంతో మాట్లాడి శాశ్వత ప్రాతిపదికన వంతెనల నిర్మాణంతోపాటు 6 లేన్ల రహదారిగా అభివృద్ధి చేయాలన్నారు. పనులు 2020 జనవరిలో మొదలై ఇటీవలే పూర్తయ్యాయి. కరోనా, వరదల కారణంగా సుమారు ఏడాదిన్నరపాటు పనులు సక్రమంగా జరగలేదు.

పక్కా ప్రణాళికతో..

గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని ఎంతటి వరదనైనా తట్టుకునేలా ఈసారి హైవేపై భారీ సంఖ్యలో వంతెనలు ఏర్పాటు చేశారు. అప్పట్లో వరదలకు హైవేపై మనుబోలు బైపాస్ నుంచి ఆదిశంకర కళాశాల మధ్యలో మూడుచోట్ల వంతెనలు కొట్టుకుపోయాయి. అదే సమయంలో హైవేకు కిలోమీటర్ దూరంలో సమాంతరంగా ఉన్న రైల్వే ట్రాక్ చెక్కు చెదరలేదు. దీంతో హైవే డిజైన్‌పై అప్పట్లో తీవ్ర విమర్శలు చెలరేగాయి. మనుబోలు – గూడూరు మధ్యలో రైల్వే లైన్‌పై సుమారు పదిచోట్ల వంతెనలు ఉండగా హైవేపై మాత్రం మూడు, నాలుగుచోట్ల అదీ చిన్న వంతెనలు ఏర్పాటు చేయడంతోనే వరద నీరు వెళ్లే మార్గం లేక వంతెనలు కొట్టుకుపోయినట్లు విమర్శలు వచ్చాయి. దీంతో ఈసారి భారీ సంఖ్యలో వంతెనల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు.



ఆదిశంకర జంక్షన్ వద్ద నిర్మించిన అండర్‌పాస్

రూ.134 కోట్లతో పనులు

రూ.134 కోట్లతో మొత్తం 3.5 కిలోమీటర్ల మేర రహదారితోపాటు 9 చిన్న వంతెనలు, ఒక పెద్ద వంతెన, ఒక అండర్‌పాస్, ఒక కల్వర్ట్ నిర్మించారు. దీంతోపాటు ఒకేసారి హైవేను 6 లేన్లుగా విస్తరణ చేయడంతో ప్రస్తుతం సాఫీగా వాహనాల రాకపోకలు సాగుతున్నాయి.

అప్పట్లో పట్టించుకోలేదు

భారీ వంతెనలు కట్టేందుకు చొరవ తీసుకుంటామని గత టీడీపీ ప్రభుత్వ హయాంలో నాయకులు చెప్పారు. అయితే పట్టించుకున్న దాఖలాల్లేవు. వరద ముప్పు ఉన్న ప్రాంతంలో ఫ్లై ఓవర్ నిర్మించేలా చూస్తామని చెబుతూ సర్వేలతో కాలయాపన చేయడమే తప్ప నిర్మాణం కార్యరూపం దాల్చలేదు. ఈ క్రమంలో డైవర్షన్ రోడ్ల వద్ద నాలుగేళ్ల కాలంలో 30కి పైగా ప్రమాదాలు జరిగాయి. పలువురు మృత్యువాత పడగా పదుల సంఖ్యలో వాహనచోదకులు క్షతగాత్రులయ్యారు.

గతంలో కాలయాపన చేశారు



గత ప్రభుత్వం పనుల విషయంలో చొరవ తీసుకోలేదు. నాలుగేళ్లపాటు సర్వేలతోనే కాలయాపన చేశారు. ఆ సమయంలో ఈ మార్గంలో ప్రయాణం నరకప్రాయంగా ఉండేది. తరచూ ప్రమాదాలు జరిగేవి. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి చొరవతో పనులు మొదలుపెట్టి పూర్తి చేశారు.

– కడివేటి చంద్రశేఖర్‌రెడ్డి, ఉప సర్పంచ్, మనుబోలు


విస్తరణ పనులు పూర్తి



2016 – 2020 మధ్య కాలంలో తాత్కాలిక డైవర్షన్ రోడ్ల వద్ద తరచూ హైవేపై ప్రమాదాలు జరిగేవి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 2020లోనే పనులు మొదలైనా కోవిడ్ కారణంగా ఆలస్యం జరిగింది. ఎట్టకేలకు వంతెనలతోపాటు 6 లేన్ల రహదారి విస్తరణ పనులు పూర్తవడంతో ప్రమాదాలు తగ్గుతాయి.

– గుండాల వజ్రమ్మ, ఎంపీపీ, మనుబోలు

హరిత శోభితం



పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు మొక్కలు నాటండి. వాటిని పరిరక్షించండి అంటూ అధికారులు నిత్యం అవగాహన కల్పిస్తున్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో, రోడ్లకు ఇరువైపులా విస్తృతంగా మొక్కలు నాటారు. సోమవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ముత్తుకూరుకు వెళ్లే ప్రధాన రహదారిలోని కాకుపల్లి ప్రాంతంలో తీసిన చిత్రం ఇది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు

రాజరాజేశ్వరి ఆలయాభివృద్ధికి సహకారం



ధ్వజస్తంభం వద్ద వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ప్రశాంతిరెడ్డి దంపతులు

- వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ప్రశాంతిరెడ్డి దంపతులు

నెల్లూరు(బృందావనం): నెల్లూరులోని రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయాభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని రాజ్యసభసభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, టీటీడీ న్యూఢిల్లీ అడ్వైజరీ బోర్డు కమిటీ చైర్‌పర్సన్ వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి తెలిపారు. వేమిరెడ్డి దంపతులు ఆదివారం దేవస్థానానికి విచ్చేశారు. కార్యనిర్వహణాధికారి అర్వభూమి వెంకట శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో వీపీఆర్ దంపతులను ఆలయ మర్యాదలతో ఆహ్వానించారు. అనంతరం అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వీపీఆర్ దంపతులు అధికారులు, ధర్మకర్తల మండలి సభ్యులను అడిగి పనుల వివరాలను తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ అమ్మవారి ఆలయంలో నూతన ధ్వజస్తంభ ప్రతిష్ఠ, గర్భాలయం ద్వారానికి బంగారు తాపడం, ముఖమండపం గోడలకు గ్రానైట్, మండపంలో నవదుర్గ విగ్రహాల ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. అందుకయ్యే ఖర్చును తాము భరిస్తామని వివరించారు. కార్యక్రమంలో విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, జిల్లా దేవదాయ, ధర్మదాయ శాఖ అధికారి జె.శ్రీనివాస్, దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ రత్నం జయరామ్, సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకుడు సన్నపురెడ్డి పెంచలరెడ్డి, ఇంకా మదన్‌మోహన్‌రెడ్డి, మల్లు రామమోహన్‌రెడ్డి, జి.దొరబాబు, సతీష్, పెంచలమ్మ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బంగారు చీరలో ముత్యాలమ్మ దర్శనం



చిల్లకూరు: మండల తీర ప్రాంతంలోని తూర్పు కనుపూరులో ఉన్న ముత్యాలమ్మ ఆలయంలో అమ్మవారు ఆదివారం బంగారు చీరలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం వివిధ రకాల అభిషేకాలు నిర్వహించారు. అనంతరం మూలవిరాట్‌కు బంగారు చీరను అలంకరించారు. పౌర్ణమిని పురస్కరించుకుని అమ్మవారికి బంగారు చీరను అలంకరించడం ఆనవాయితీగా వస్తోంది. భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ఈఓ నవీన్‌కుమార్, ట్రస్టు బోర్డు చైర్‌పర్సన్ ఇంద్రసేనమ్మ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 160
లేయర్ (లైవ్)	: 100
బ్రాయిలర్ చికెన్	: 270
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 300
లేయర్ చికెన్	: 170



నిమ్మ ధరలు పొదలకూరు (కిలో)

పెద్దవి	: రూ. 40
సన్నవి	: రూ. 20
పండ్లు	: రూ. 10



చంద్రబాబును ప్రజలు నమ్మరు



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

- మళ్లీ అబద్ధపు హామీలతో మభ్యపెడుతున్నారు
- కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం: 'అధికారంలోకి వచ్చేందుకు చంద్రబాబు అనేక హామీలిస్తున్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఆయన్ను ప్రజలు నమ్మరు.' అని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అన్నారు. బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీలో ఆదివారం విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. చంద్రబాబు అబద్ధాల కోరు, మోసగాడని విమర్శించారు. 2014 ఎన్నికల్లో వందల హామీలిచ్చి.. అధికారంలోకి వచ్చాక ఏ ఒక్కటీ నెరవేర్చకుండా ప్రజలను మభ్యపెట్టాడని తెలిపారు. మళ్లీ ఎన్నికలు దగ్గర పడడంతో మహానాడులో అబద్ధపు హామీలిచ్చాడని ఆరోపించారు. ప్రజలు తెలివైన వారని, బాబు గురించి తెలుసు కాబట్టే గత ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి 151 ఎమ్మెల్యే స్థానాలు, 22 ఎంపీ స్థానాలు ఇచ్చారని తెలిపారు. బాబు తొమ్మిది సంవత్సరాలు ఉమ్మడి రాష్ట్రంలో, 5 సంవత్సరాలు కొత్త రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉండి రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించాడని ఆరోపించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల మనసులో సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్నారని తెలిపారు. చంద్రబాబు ఆయన దత్తపుత్రుడు పవన్ కళ్యాణ్ ఎన్ని కలలు కన్నా మరో 25 సంవత్సరాలు ఈ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ ఉంటారని ధీమా వ్యక్తం చేశారు.

బాధితులకు అండగా..

బుచ్చిరెడ్డిపాళెంలోని వివిధ ప్రాంతాలకు చెందిన బాధితులకు నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి ట్రస్ట్ ద్వారా రూ.70 వేల ఆర్థిక సాయం అందజేశారు. అలాగే కోవూరుకు చెందిన సుమలతకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి వచ్చిన రూ.1,97,000 చెక్కును ఇచ్చారు. కార్యక్రమంలో డీఏఏబీ చైర్మన్ దొడ్డంరెడ్డి నిరంజన్‌బాబురెడ్డి, చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, వైఎస్సార్‌సీపీ మండల, పట్టణ కన్వీనర్లు చెర్లో సతీష్‌రెడ్డి, టంగుటూరు మల్లికార్జున్‌రెడ్డి, నాయకులు యర్రంరెడ్డి గోవర్ధన్‌రెడ్డి, పుట్టా సుబ్రహ్మణ్యం నాయుడు, మోర్ల మురళి, కోడూరు మధుసూదన్‌రెడ్డి, మేనకూరు సీతారామిరెడ్డి, కౌన్సిలర్లు శివకుమార్‌రెడ్డి, నస్రీన్ పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మెల్యే రామిరెడ్డి జన్మదిన వేడుకలు



ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డికి కేక్ తినిపిస్తున్న అభిమానులు

కావలి: కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి జన్మదిన వేడుకలను నియోజకవర్గ వ్యాప్తంగా ఆదివారం ఘనంగా నిర్వహించారు. కావలి పట్టణం, రూరల్ మండలాలతోపాటు అల్లూరు, బోగోలు, దగదర్తి మండలాల్లో అభిమానులు, కార్యకర్తలు కార్యక్రమాలను జరిపారు. పట్టణంలో ఈతముక్కల చంద్రశేఖరరెడ్డి (చందు) ఆధ్వర్యంలో యువత భారీ బైక్ ర్యాలీ చేశారు. పాతూరు నుంచి ట్రంక్ రోడ్డు మీదుగా ఎమ్మెల్యే నివాసం వరకు ఈ ర్యాలీ జరిగింది. భారీ కేక్ కట్ చేసి ఎమ్మెల్యేకి తినిపించారు. ఈ సందర్భంగా అభిమానులు ఎమ్మెల్యే నివాసంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఉదయగిరి బ్రిడ్జి కూడలి, కొనదిన్నె గిరిజన కాలనీ, వైకుంఠపురం కూడలి, జనతాపేటలోని దివంగత మహానేత డాక్టర్ వైఎస్సార్ విగ్రహం వద్ద పెద్దఎత్తున అన్నదానం చేశారు.

చెంగాళమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

సూళ్లూరుపేట: పట్టణంలోని శ్రీచెంగాళమ్మ పరమేశ్వరి ఆలయంలో ఈనెల 8 నుంచి 14వ తేదీ వరకు నిర్వహించనున్న అమ్మవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం అఖండజ్యోతిని వెలిగించారు. ముందుగా అఖండజ్యోతికి వేదపండితులు పూజలు చేశారు. అనంతరం ఆలయంలోని పరివార దేవతలకు చూపించి హారతులిచ్చారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ దువ్వూరు బాలచంద్రారెడ్డి, ఈఓ ఆళ్ల శ్రీనివాసులురెడ్డి, పాలక మండలి సభ్యులు ఎం.చంద్రశేఖర్‌రెడ్డి, ఎంఎం పద్మజ, బి.సునీత, ఎస్.నాగమణి, పి.మారెమ్మ పాల్గొన్నారు.

- జ్యేష్ఠ పౌర్ణమి సందర్భంగా ఆలయం ఆవరణలోని యాగశాలలో మహా చండీయాగాన్ని ఘనంగా నిర్వహించారు. దీనికి నాయుడుపేటకు చెందిన ఓడూరు మునికృష్ణారెడ్డి దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.



అఖండజ్యోతికి పూజలు చేస్తున్న చైర్మన్ తదితరులు

ప్రాణాలు తీసిన అతివేగం



విశాక్ మృతదేహం

- బుచ్చిరెడ్డిపాళెంలో రోడ్డు ప్రమాదం
- నెల్లూరుకు చెందిన ఇద్దరి మృతి



జగన్‌మోహన్ మృతదేహం

బుచ్చిరెడ్డిపాళెం: అతివేగం కారణంగా రెండు ప్రాణాలు పోయాయి. మండలంలోని నెహ్రూనగర్ సమీపంలోని ముంబై జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నెల్లూరుకు చెందిన విశాక్ (23), జగన్‌మోహన్ (42) దుర్మరణం చెందారు. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. విశాక్, జగన్‌మోహన్ పెయింట్ పనులు చేస్తుంటారు. బుచ్చిరెడ్డిపాళెంలో ఆదివారం మధ్యాహ్నం వరకు పని చేశారు. తర్వాత మోటార్‌బైక్‌పై నెల్లూరు బయలుదేరారు. నెహ్రూనగర్‌కు వచ్చే సరికి షాపు వద్ద నుంచి ఇద్దరు వ్యక్తులు హఠాత్తుగా బైక్‌పై రోడ్డు మీదకు వచ్చారు. ఇదే సమయంలో అతివేగంగా వస్తున్న జగన్‌మోహన్ బైక్‌ను కంట్రోల్ చేయలేక ఎదురుగా రోడ్డు మీదకు వస్తున్న బైక్‌ను బలంగా ఢీకొట్టాడు. దీంతో విశాక్, జగన్‌మోహన్ ఎగిరి రోడ్డు మీద పడ్డారు. ఇదే సమయంలో వారు బైక్ ఎదురుగా వస్తున్న కారుపై పడడంతో ముందు భాగం దెబ్బతింది. రోడ్డు మీద పడిన విశాక్ తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. జగన్‌మోహన్ కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతుండగా స్థానికులు అతడిని రోడ్డు పక్కన చెట్టు వద్దకు తీసుకెళ్లి 108 అంబులెన్స్‌కు, పోలీసులకు సమాచారం అందించారు. సీఐ రామారావు, ఎస్సై వీరప్రతాప్ ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. కాసేపటికి జగన్‌మోహన్ కూడా మృతి చెందాడు. ప్రమాదానికి అతివేగమే కారణమని విచారణలో తెలిసిందని పోలీసులు తెలిపారు. కాగా బైక్‌పై రోడ్డు మీదకు వచ్చిన వారికి మాత్రం స్వల్ప గాయాలయ్యాయి. ప్రమాదం అనంతరం వారు పరారయ్యారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం బుచ్చిరెడ్డిపాళెం సీహెచ్‌సీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.